"మధురమైన పిల్లలూ - ఇంటి-ఇంటినీ స్వర్గముగా తయారుచేసే బాధ్యత పిల్లలైన మీపై ఉంది, అందరికీ పతితుల నుండి పావనులుగా అయ్యే లక్ష్యాన్ని ఇవ్వాలి, దైవీ గుణాలను ధారణ చేయాలి"

ప్రశ్న:- ఈశ్వరీయ ఒడిలోకి రావడం ద్వారా పిల్లలైన మీకు ఏ అనుభవం కలుగుతుంది?

జవాబు:- మంగళ మిలనాన్ని జరుపుకునే అనుభవము ఈశ్వరీయ ఒడిలోకి వచ్చే పిల్లలకు కలుగుతుంది. సంగమయుగము ఈశ్వరునితో మిలనము జరుపుకునే యుగము అని మీకు తెలుసు. మీరు ఈశ్వరునితో మిలనము జరుపుకొని భారత్ ను స్వర్గముగా తయారుచేస్తారు. ఈ సమయంలో పిల్లలైన మీరు సమ్ముఖముగా కలుసుకుంటారు. మొత్తం కల్పములో ఇంకెవ్వరూ సమ్ముఖముగా మిలనము జరుపుకోలేరు. ఇది మీ చాలా చిన్నని ఈశ్వరీయ కులము. శివబాబా తాతగారు, బ్రహ్మ తండ్రి మరియు పిల్లలైన మీరు సోదరీ-సోదరులు, ఇంకే సంబంధమూ లేదు.

పాట:- కొత్త యుగపు మొగ్గలు... (నయీ ఉమర్ కీ కలియా...)

ఓం శాంతి. బాబా వచ్చినప్పుడు మొదట కొద్ది సమయం సైలెన్స్ లో కూర్చోవాలి, ఎందుకంటే మొట్టమొదట స్మృతి యొక్క దానము ఇవ్వడం జరుగుతుంది. స్మృతి ద్వారానే పతితులను పావనంగా తయారుచేయాలి. పిల్లలైన మీరు దానమును ఇస్తున్నారు మరియు తీసుకుంటున్నారు. తండ్రి వచ్చి ముళ్ళ నుండి మొగ్గలుగా తయారుచేస్తారు, తర్వాత మొగ్గల నుండి పుష్పాలుగా అవుతారు. ఏ విధంగా మీరు స్వర్గానికి యోగ్యులుగా తయారవుతున్నారో, ప్రతి ఒక్కరినీ అదే విధంగా తయారుచేయడం మీ సేవ అని మీకు తెలుసు.

తండ్రి వచ్చి మొదట ఆరోగ్యాన్ని, ఆ తర్వాత ఐశ్వర్యాన్ని ఇస్తారు. మొదట శాంతి, ఆ తర్వాత సుఖము. నిజానికి సుఖము రెండింటిలోనూ ఉంది. పిల్లలైన మీకు సుఖము మరియు శాంతి రెండూ కావాలి మరియు సన్యాసులు మొదలైనవారు ఎవరైతే ఉన్నారో వారు కేవలం శాంతిని కోరుకుంటారు. సన్యాసులు సుఖాన్ని కోరుకోరు. సుఖాన్ని అయితే వారు ఇవ్వలేరు. ఒకవేళ శాంతిని ఇచ్చినా కూడా అది అల్పకాలిక క్షణభంగుర సుఖము కొరకు మాత్రమే. సుఖము కాకిరెట్టతో సమానమైనది అని వారు అంటారు. సన్యాసులు ఎక్కువగా ముక్తి కొరకు శాంతిని కోరుకుంటారు. ముక్తినైతే ఇంకెవ్వరూ ఇవ్వలేరు. దీనిని అనంతమైన ముక్తి, అనంతమైన జీవన్ముక్తి అని అంటారు, దీనిని అనంతమైన తండ్రి మాత్రమే ఇవ్వగలరు. ఈ సమయంలో అందరూ ముళ్ళుగా ఉన్నారని మీకు తెలుసు. ముళ్ళు గుచ్చుకుంటాయి. తండ్రి అంటారు, అందరూ ఒకరినొకరు కామ ఖడ్గముతో హతమార్చుకుంటారు. కామ వికారాన్ని హింస అంటారని వారికి తెలియదు. మీరు వికారాల్లోకి వెళ్ళినట్లయితే ఒకరికొకరు ఆదిమధ్యాంతాలు దుఃఖాన్ని ఇచ్చుకుంటారు. ఇది దుఃఖమయ ప్రపంచము. సుఖమయ ప్రపంచమని స్వర్గాన్ని అంటారు - ఆ సమయంలో కొత్త సృష్టి, కొత్త భారత్ ఉండేది. భారతవాసులు ఎవరైతే దేవీ-దేవతలకు పూజారులుగా ఉన్నారో, వారికి - ఈ దేవతల రాజ్యము ఉండేదని, దానిని స్వర్గము అంటారని తెలుసు. ఇది వారికి అనుభవమవుతుంది. లక్ష్మీ-నారాయణుల మందిరంలోకి వెళ్ళి వారి మహిమను గానం చేస్తారు. భారత్ కు వీరు అధిపతులుగా ఉండేవారని భావిస్తారు. భారత్ స్వర్గముగా ఉండేదని కూడా అనుభవమవుతుంది, కానీ కాసేపటి కోసమే అలా అనుభవమవుతుంది. భారత్ లో లక్ష్మీ-నారాయణులకు ఇన్ని మందిరాలను తయారుచేసారంటే వారి రాజధాని ఉండేది కదా అనైతే భావిస్తారు. వారిని మహారాజు, మహారాణి అని అంటారు. కానీ, వారెప్పుడు ఉండేవారు అన్నది మర్చిపోయారు. ఇది ఎంత సాధారణమైన పొరపాటు. ఇదంతా జరిగి పెద్ద ఎక్కువ సమయమేమీ గడవలేదు. ఇది 5000 సంవత్సరాల నాటి విషయం. క్రైస్టు, బుద్ధుడు మొదలైనవారు వచ్చి 2000-2500 సంవత్సరాలు అయ్యింది. వారి విషయంలోనైతే రీ-ఇన్కార్నేషన్ (పునః అవతరించారు) అని అంటారు. నిజానికి పునః అవతరించడమైతే (పునర్జన్మ) ప్రతి ఒక్కరి విషయంలోనూ జరుగుతుంది. ఆత్మ వచ్చి ప్రవేశిస్తుంది, దీనిని కూడా రీఇన్కార్నేట్ (పునః అవతరణ) అని అంటారు. కానీ మొదట పెద్దవారి పేరు మహిమ చేయబడుతుంది. పరమపిత పరమాత్మ అవతరిస్తారు, ఆ సమయంలో వచ్చి శరీరములో ప్రవేశిస్తారు అని అంటారు. రీ-ఇన్కార్నేషన్ యొక్క అర్థము ఇదే. ఎవరైతే గొప్ప పేరు-ప్రసిద్ధి కలవారు ఉంటారో వారిని గురించి ఇలా అనడం జరుగుతుంది. ఉదాహరణకు బుద్ధుడి అవతరణ, క్రైస్టు అవతరణ అని అంటారు. బౌద్ధులకు మరియు క్రిస్టియన్లలకు భారత్ తో సంబంధం ఉన్నట్లుగా కనిపిస్తుంది. గురునానక్ వచ్చి 500 సంవత్సరాల అయ్యింది అన్నట్లు చూపిస్తారు. వీరిది ఒక

చిన్న అవతరణ. వాళ్ళది పెద్దది. కావున అందరూ పునః అవతరిస్తారు (పునర్జన్మలు తీసుకుంటారు). ఇప్పుడు పరమపిత పరమాత్మను పిలుస్తారు. కానీ వారు ఎప్పుడు వస్తారు, ఎలా వస్తారు, ఇది ఎవ్వరికీ తెలియదు. శరీరములోకైతే తప్పకుండా రావలసి ఉంటుంది. కానీ జన్మ తీసుకోని కారణముగా వారిది అవతరణ అని అంటారు. చిన్నపిల్లవాడిగా అయితే అవ్వరు. అందరికన్నా పెద్ద అవతరణ పరమపిత పరమాత్మదే అని అంటారు. పరమాత్మ 24 అవతారాలు తీసుకుంటారు అని అంటారు. ఇప్పుడేమో రాయి, రప్పల్లో కూడా అవతరించారు అని అంటున్నారు. దిగజారిపోతూ ఉంటారు. ఏ విధంగా భారత్ దిగజారుతూ ఉంటుందో అలాగే వారి మాటలు కూడా దిగజారుతూ ఉంటాయి. తండ్రి కొత్త ప్రపంచానికి రచయిత. కావున తప్పకుండా వారు కొత్త మరియు పాత ప్రపంచాల సంగమములోనే వస్తారు. వారిది అందరికన్నా పెద్ద అవతరణ అని అంటారు. శివునిది అందరికన్నా పెద్ద అవతరణ. కానీ, మనుష్యులు అర్థం చేసుకోరు, ఎందుకంటే వారు పరమాత్మ నుండి విముఖులయ్యారు. నిరాకారునితో అయితే తప్పకుండా పరిచితులైయున్నారు కానీ పరమాత్మ ఎప్పుడు వస్తారు, వచ్చి ఏమి చేస్తారు అన్నది వారికి తెలియదు. విష్ణువు విషయంలో అవతరణ అని అనరు. దేవీ-దేవతా ధర్మం యొక్క అవతరణ అని అనరు. దేవీ-దేవతా ధర్మం యొక్క స్థాపన అని అంటారు.

విష్ణు అవతరణ అనే నాటకాన్ని కూడా ఒకటి తయారుచేస్తారు. నిజానికి విష్ణు అవతరించే ప్రసక్తే లేదు. మీరు ఇప్పుడు విష్ణు కులానికి చెందినవారిగా అవుతున్నారు. ఈశ్వరుని కులము ఉంది కదా. ఈ బ్రహ్మ శివునికి పుత్రుడు, మీరు బ్రహ్మకు పిల్లలు, దీనిని ఈశ్వరీయ కులము అని అంటారు. పరమపిత పరమాత్మ అంటారు, నేను వచ్చి మిమ్మల్ని నా వారిగా చేసుకుంటాను. నేను వచ్చి పిల్లలైన మీకు తండ్రిగా అవుతాను. నిజానికి నేను అందరికీ తండ్రినే, కానీ ఇప్పుడు మీరు బ్రహ్మ ద్వారా నా వారిగా అయ్యారు, కావున మీరు నన్ను తాతగారు అని అంటారు. తప్పకుండా వారు ఆత్మలకు తండ్రే. ఈ సమయంలో నేను వచ్చి ఉన్నానని అందరికీ తెలుసు. మీరు మాత్రమే నన్ను ఇప్పుడు కలుసుకుంటారు. ఎప్పుడైతే తండ్రి జన్మనిస్తారో అప్పుడే అనంతమైన తండ్రిని కలుసుకుంటారు. ఇప్పుడు నేను మిమ్మల్ని బ్రహ్మ ద్వారా దత్తపుత్రులుగా చేసుకున్నాను. వికారాల ద్వారానైతే పిల్లల జన్మ జరగదు, ఇంతమంది ప్రజలు ఉన్నారు, ఎంతమంది సోదరీ-సోదరులు ఉన్నారు, కావున వీరందరూ ముఖవంశావళియే కదా. సన్యాసులకు వంశావళి ఉండదు, ఎందుకంటే వారిలో తాతయ్య- తండ్రి అనే సంబంధమేమీ ఉండదు. ఇక్కడ తండ్రి కూడా ఉన్నారు, తాతగారు కూడా ఉన్నారు. వీరిని దాదా (పెద్ద అన్నయ్య) అని అంటారు. తండ్రి వచ్చి తమ వారిగా చేసుకుంటారు. మనం ఈశ్వరుని ఒడిలోకి వచ్చామని మీకు తెలుసు, ఇది మంగళ మిలనము. కలియుగాంతము మరియు సత్యయుగ ఆది, దీనినే సంగమము అని అంటారు. సంగమములో మిలనము జరుగుతుంది. ఎలాగైతే మూడు నదుల సంగమము ఉంది కదా, అక్కడ ఏమి జరుగుతుంది? గురువులు మరియు జిజ్ఞాసువుల మంగళ-మిలనము జరుగుతుంది. అది దైహికమైనది. ఆత్మ మరియు పరమాత్మల మంగళ మిలనము అన్న గాయనము కూడా ఉంది. ఇది అన్నింటికన్నా శ్రేష్ఠమైనది. ఆత్మలు పరమపిత పరమాత్మను కలుసుకుంటాయి. ఇందులో నీటి నదుల విషయమేదీ లేదు. ఇక్కడ మీరు కూర్చున్నారు. ఇది మీ చాలా గొప్ప మంగళ మిలనము. ఆత్మలు కూడా చైతన్యమైనవే. ఇది పరమపిత పరమాత్మ అద్దెకు తీసుకున్న శరీరము, దీనిని మంగళ మిలనము అని అంటారు. కుంభమేళా అని అంటారు కదా. కుంభమును కూడా సంగమము అని అంటారు. మూడు నదుల సంగమానికి కుంభము అన్న పేరును పెట్టారు. అన్నింటికన్నా పెద్ద సంగమము ఏది? సాగరము మరియు నదుల సంగమము. అన్నింటికన్నా పెద్ద నది బ్రహ్మపుత్రా నది. వారిలోకి బాబా వస్తారు, కావుననే సాగరము మరియు బ్రహ్మపుత్రా నది యొక్క మేళా కలిసి జరుగుతుంది. ఇప్పుడు కుంభమేళా సంగమములో జరుగుతుంది. మీరందరూ జ్ఞాన సాగరుడైన తండ్రిని కలుసుకుంటారు, దీనిని ఈశ్వరీయ కుంభమేళా అని అనవచ్చు. ఇది ఆత్మలు మరియు పరమాత్మల సంగమము. కుంభము అన్నా లేక సంగమము అన్నా, విషయం ఒక్కటే. పిల్లలైన మీకు తెలుసు, మనము మన కొరకు స్వర్గ స్థాపన చేసుకుంటున్నాము. మనం ఇంట్లో పవిత్రముగా ఉండాలి. ఎక్కడైతే పవిత్రత ఉంటుందో, దానినే స్వర్గమని అంటారు. పిల్లలు పవిత్రంగా ఉన్నట్లయితే పవిత్రత, సుఖ-శాంతులు ఉంటాయి. మీ అవస్థ దేవతల వలె ఉండాలి. ఏ అవగుణమూ ఉండకూడదు, దానినే స్వర్గమని అంటారు. అదే తర్వాత శాశ్వతముగా స్వర్గముగా అవుతుంది. ఇంట్లో అంతటి యోగ్యులుగా తయారవ్వాలి, అందుకే ఇంటి-ఇంటినీ స్వర్గముగా తయారుచేయండి అని అంటారు. మీరు మనుష్యులను స్వర్గములోకి వెళ్ళేందుకు యోగ్యంగా తయారుచేస్తారు. ప్రతి ఇంటినీ స్వర్గముగా తయారుచేయండి అని మీ గురించే పాట ఉంది. సత్యయుగములో ప్రతి ఇంటిలోనూ స్వర్గము ఉండేది, ఇప్పుడు లేదు. ఏ పిల్లలైతే తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారో వారికి తమ ఇంట్లో కూర్చొనే పతితుల నుండి పావనులుగా తయారయ్యే లక్ష్యాన్ని ఇవ్వాలి.

ఇది అన్నింటికన్నా పెద్ద చైతన్య తీర్థ స్థానము. ఎక్కడైతే సాగరుడైన శివబాబా ఉంటారో, అక్కడ ఆత్మలైన మీరు గంగలు తప్పకుండా ఉంటారు. ఇది అన్నింటికన్నా పెద్ద ఉన్నతోన్నతమైన మేళా. అవన్నీ భక్తి మార్గపు మేళాలు, ఇది జ్ఞాన మార్గపు మేళా. భక్తి మార్గపు మేళాలైతే జన్మజన్మాంతరాలూ జరుగుతూనే ఉంటాయి. జ్ఞాన మార్గపు మేళా ఒక్క సారే జరుగుతుంది. ఇది ఆత్మిక మిలనము. పరమ ఆత్మ పరంధామం నుండి వచ్చి పిల్లలను కలుసుకుంటారు. అన్నింటికన్నా మంచి యాత్ర లేక మేళ ఇదే. ఈ చైతన్య సాగరుడైతే ఎక్కడికైనా వెళ్ళగలరు. ఆ జడమైన సాగరమైతే ఎక్కడికీ వెళ్ళదు. ఈ సాగరం వెళ్తారు. నదులైన మీరు కూడా ఆహ్వానంపై వెళ్తారు. జ్ఞాన సాగరుడు ఈ బ్రహ్మపుత్రా నదితో పాటు వెళ్తారు. మీరు భిన్న-భిన్న రకాల నదులు - కొందరు పవిత్రముగా ఉన్నారు, కొందరు అపవిత్రముగా ఉన్నారు. అప్పుడప్పుడు పవిత్రముగా ఉండలేనివారు చాలామంది వచ్చేస్తారు. కానీసం వస్తారు కదా. బయట ఉండే గృహస్థులు కూడా వస్తారు. వారిని అనుమతించడం జరుగుతుంది. అలాగని అందరినీ అనుమతిస్తారని కాదు. కొందరు మిత్ర-సంబంధీకులు మొదలైనవారు వస్తారు, వారిని పైకి లేపేందుకు అనుమతినివ్వడం జరుగుతుంది. లేదంటే నియమాలైతే ఎన్నో ఉన్నాయి. ఇంద్రప్రస్థములోకి పతితులెవ్వరూ రాకూడదు. మార్గదర్శకులు లేక దేవకన్యలు మొదలైనవారు పతితులెవ్వరినీ తమతోపాటు తీసుకురావడానికి వీల్లేదు. అందుకే తండ్రి అంటరు, అప్రమత్తంగా ఉండండి, సర్టిఫికేట్ అయితే మీకే లభిస్తుంది. ఎవరినైనా మీతోపాటు తీసుకువచ్చినా లేక పంపించినా, బాధ్యత మీపైనే ఉంటుంది. ఆ మాటకొస్తే సెంటర్లకు కూడా ఆహ్వానం ఇస్తారు. ఎంతమంది పతితులు వస్తూ ఉండి ఉండవచ్చు. సెంటర్లకు పతితులు వస్తేనే కదా వారిని పావనంగా చేయగలరు. ఇక్కడైతే సాగరుడు కూర్చుని ఉన్నారు, కావున నియమాలు పెట్టడం జరిగింది. నాడిని చూడడం జరుగుతుంది. డాక్టర్స్ మరియు సర్జన్స్ రకరకాలుగా ఉంటారు కదా. మమ్మా-బాబా లేక అనన్యమైన పిల్లలు మాట్లాడినప్పుడు - వీరి బుద్ధిలో కూర్చుంటుందా లేదా అన్నది వారికి వెంటనే తెలిసిపోతుంది. ఇద్దరు తండ్రులు ఉన్నారు అని మీరు ఎవరికైనా అర్థం చేయిస్తే వారు వెంటనే ఒప్పుకుంటారు. యుక్తులను చెప్పడం జరుగుతుంది. పరమపిత పరమాత్మనైతే అందరూ తలచుకుంటారు. మేము ఫలానా తండ్రికి పిల్లలము అని అంటారు. కేవలం వారి కర్తవ్యము గురించి తెలియదు. ఏ వ్యక్తులు ఏయే నామ-రూపాలతో వస్తారో, అవే నామ-రూపాలతో 5000 సంవత్సరాల తర్వాత మళ్ళీ తప్పకుండా రావలసిందేనని పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. క్రైస్టు చిత్రమేదైతే ఉందో, అది అచ్చంగా అలాగే మళ్ళీ అదే సమయంలో ఉండగలదు. ఈ విధంగా ఇంకే మనుష్యులదీ ఉండదు. కృష్ణుని చిత్రమేదైతే ఉందో అది ఇంకే మనుష్య రూపములోనూ ఉండదు. ఆత్మ భిన్న-భిన్న నామ, రూప, దేశ, కాలాదులలో జన్మ తీసుకుంటూ, తీసుకుంటూ ఇప్పుడు పతితముగా అయిపోయింది, దానిని మళ్ళీ పావనంగా తయారుచేస్తారు.

తండ్రి కళ్యాణకారి అని, రావణుడు అకళ్యాణకారి అని మీకు తెలుసు. అందరికీ సద్గతిని ఇచ్చేవారు తండ్రియే. అప్పుడిక మనుష్యులకే కాదు, అన్ని వస్తువులకూ సద్గతి లభిస్తుంది. నరకము యొక్క వినాశనము మరియు స్వర్గము యొక్క స్థాపన జరుగుతుంది. కల్పపూర్వము ఎవరైతే వచ్చారో - కొందరు పంజాబీలు, కొందరు పారసీలు మొదలైనవారు వస్తారు కదా, అందరికీ ఆహ్వానమును ఇవ్వాలి. తండ్రి వచ్చి ఉన్నారు - అని దండోరా మ్రోగించినా పర్వాలేదు. మీ చిత్రాలు కూడా చాలా బాగున్నాయి. ఇప్పుడు మీరు మందిర యోగ్యులుగా అవుతారు. భూతాలను తొలగించడంలో ఎంతో కష్టపడవలసి ఉంటుంది. లక్ష్మిని లేక నారాయణుడిని వరించేందుకు వికారీ అవగుణాలను తొలగించడంలో ఎంతగా కష్టపడవలసి ఉంటుంది. కొందరికి కామమనే భూతము, కొందరికి క్రోధమనే భూతము, కొందరికి మోహమనే భూతము చెంపదెబ్బ వేస్తాయి. పూర్తిగా పడిపోతారు. లోభానికి వశమై కూడా పడిపోతూ ఉంటారు. మంచి, మంచి ఇళ్ళ నుండి వచ్చిన పిల్లలు మిఠాయిని చూడగానే దాచిపెట్టుకుని తినేస్తారు. లోభం కూడా ఎంతమందిని నష్టపరిచింది. లోభానికి వశమయ్యే దొంగతనం చేస్తారు. మొదట మీరు భట్టీలో ఉండేవారు. ఇప్పుడైతే అందరూ తమ ఇళ్ళలో భట్టీని తయారుచేయవలసి ఉంటుంది. తండ్రి ఒకే పెద్ద భట్టీని తయారుచేసారు. ఇప్పుడైతే మొదట ఏడు రోజులు భట్టీలో ఉండాలి అని చెప్తారు. ఈ రోజుల్లో ఎవరైనా భట్టీలో కూర్చోవడం చాలా కష్టము. సెంటరుకు వచ్చినప్పుడు కూడా రంగును అంటిస్తారు, మళ్ళీ ఇంటికి వెళ్ళడంతో అది తొలగిపోతుంది. సాంగత్య దోషం అంటుకుంటుంది. ఇప్పుడైతే ఎంతో కష్టపడవలసి ఉంటుంది.

మనం ఈశ్వరీయ కులములో కూర్చున్నామని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. తాతగారు, తండ్రి మరియు సోదరీ, సోదరులైన మనము ఉన్నాము. బ్రాహ్మణ కులము సర్వోత్తమమైనదిగా గాయనం చేయబడింది. ఆ బ్రాహ్మణులకు కూడా మీరు జ్ఞానాన్ని ఇవ్వవచ్చు - బ్రాహ్మణులు ఉత్తమమైన పిలకవంటివారు, ఈ సంగమయుగీ బ్రాహ్మణులే తిరిగి దేవతలుగా అవుతారు. మొదట, దేవతల కన్నా ఉన్నతముగా బ్రాహ్మణులు ఉంటారు, పిలక ఉన్నతమైనదే కదా. బ్రాహ్మణులైన మీరు దేవతలను పూజిస్తారు, స్వయాన్ని పూజారులుగా, వారిని పూజ్యులుగా భావిస్తారు - అని మీరు ఆ

పూజారులకు, ఆ బ్రాహ్మణులకు ఇది అర్థం చేయించవచ్చు. మీరు సత్యాతి-సత్యమైన సంగమయుగీ బ్రాహ్మణులు. మీరు బ్రహ్మ ముఖవంశావళులు, తిరిగి మీరే దేవతలుగా అవుతారు. స్వర్గపు దేవతలుగా తప్పకుండా పరమపిత పరమాత్మయే తయారుచేస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లోపల ఉన్న అవగుణాలను పరిశీలించుకొని వాటిని తొలగించుకోవాలి. సాంగత్య దోషము నుండి స్వయాన్ని సంభాళించుకోవాలి. దేవతా గుణాలను ధారణ చేసి స్వయాన్ని యోగ్యులుగా తయారుచేసుకోవాలి.

2. ఇంటి-ఇంటినీ స్వర్గముగా తయారుచేసే సేవను చేయాలి. భూతాలను తండ్రి స్మృతి ద్వారా పారద్రోలాలి. తండ్రితో మంగళ మిలనాన్ని జరుపుకుంటూ ఉండాలి.

వరదానము:- తమ అనాది సంస్కారాలను ఇమర్జ్ చేసుకొని సర్వ సమస్యలను దాటి వేసే ఎగిరే పక్షి భవ

మీరంతా అనాది రూపంలో ఎగిరేటువంటివారే, కానీ భారము కారణంగా ఎగిరే పక్షులకు బదులుగా పంజరములోని పక్షులుగా అయిపోయారు. ఇప్పుడు మళ్ళీ అనాది సంస్కారాలను ఇమర్జ్ చేసుకోండి అనగా ఫరిశ్తా రూపంలో స్థితులవ్వండి, దీనినే సహజ పురుషార్థము అని అంటారు. ఎగిరే పక్షులుగా అయినట్లయితే పరిస్థితులు కిందికి వెళ్ళిపోతాయి మరియు మీరు పైకి వెళ్ళిపోతారు. ఇదే సర్వ సమస్యలకు సమాధానము.

స్లోగన్:- ప్రతి అడుగులో కళ్యాణము ఉందని భావిస్తూ ప్రతి ఆత్మకు శాంతి శక్తిని దానమివ్వడమే సత్యమైన సేవ.